# 400 లక్షల కోట్ల దిగువకు..



## క్షీణించిన బీఎస్ఈ సంస్థల విలువ

ముంబై, ఫిబ్రవరి 18: బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.400 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోతుండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మదుపరుల్లో సెంటిమెంట్ నీరుగారింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో మంగళవారం రూ.2,01,032.5 కోట్లు కరిగిపోయి రూ.3,89,31,067.30 కోట్ల(4.58 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రూ.400 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించిన బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ 10 నెలల్లో ఈ మైలురాయిని కోల్పోవడం విశేషం. గతేడాది సెప్టెంబర్ 27న చారిత్రక గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ ప్రస్తుతం 10,010.86 పాయింట్లు లేదా 11.64 శాతం వాటాను కోల్పోయింది.

**సూచీలదీ అదేదారి**

స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులు ఉపసంహరణ, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మంగళవారం సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 29.47 పాయింట్లు నష్టపోయి 75,967.39 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 14.20 పాయింట్లు కోల్పోయి 22,945.30 వద్ద స్థిరపడింది. మార్కెట్లో ఇండస్ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఐటీసీ, టాటా మోటర్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోగా..ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఇండస్ట్రియల్స్ 1.51 శాతం నష్టపోగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.19 శాతం, టెలికం 1.06 శాతం, క్యాపిటల్ గూడ్స్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, యుటిలిటీ, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.



### టీవీఎస్ 2025 ఎడిషన్

## రోనిన్ బైకు

**ప్రారంభ ధర రూ.1.35 లక్షలు**

చెన్నై, ఫిబ్రవరి 18: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్‌కు మరో వాహనాన్ని పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన 225 సీసీ మోటర్‌సైకిల్ 'రోనిన్'లో భద్రత ఫీచర్లను అప్‌గ్రేడ్ చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. డ్యూయల్ చానెల్ ఏబీఎస్ రకం మాడల్ రూ.1.59 లక్షలు. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. 225.9 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 20.4 పీఎస్‌ల శక్తి నివ్వనున్నది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..ఈ బైకును యువతకు నచ్చే విధంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. స్టైలిష్, రైడింగ్ పరంగా కొన్ని మార్పులు చేసినట్టు కంపెనీ పేర్కొన్నది. ఈ మాడల్‌తో సేల్స్ పెరుగుతాయన్న ఆశాభావాన్ని సంస్థ కనబరుస్తున్నది.

## ఎన్ఎస్ఈ విలువ రూ.4.7 లక్షల కోట్లు

- **గత ఏడాది 201 శాతం వృద్ధి**

ముంబై, ఫిబ్రవరి 18: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) విలువ రూ.4.7 లక్షల కోట్లకు చేరిందని ఓ తాజా నివేదిక పేర్కొన్నది. దేశంలోని అతిపెద్ద ఈక్విటీ మార్కెట్ వేదికల్లో ఒకటైన ఎన్ఎస్ఈ.. త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన, నమోదుకాని 500 భారీ సంస్థలతో బుర్గండి ప్రైవేట్ హురున్ ఇండియా 2024కుగాను ఓ జాబితాను తీసుకొచ్చింది. ఇందులో గత ఏడాది ఎన్ఎస్ఈ విలువ ఏకంగా 201 శాతం పుంజుకున్నట్టు తేలింది. ఇక దేశంలో అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్ఎస్ఈ 10వ స్థానంలో ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎన్ఎస్ఈ స్థూల ఆదాయం 28 శాతం పుంజుకొని రూ.16,352 కోట్లుగా నమోదైంది. పన్ను అనంతర లాభం 51 శాతం ఎగిసి రూ.8,306 కోట్లుగా ఉన్నది. కాగా, ఇటీవలే లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెట్టిన ఎన్ఎస్ఈ.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దరఖాస్తు చేసుకున్నది. పబ్లిక్ ఇష్యూలో 10 శాతం వాటాలను విక్రయించే వీలున్నట్టు అంచనా.

**రిలయన్స్ టాప్**

రూ.17.5 లక్షల కోట్ల విలువతో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) హురున్ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది. రూ.16.1 లక్షల కోట్లతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో స్థానంలో ఉండగా, 30 శాతం వృద్ధిని సాధించినట్టు హురున్ పేర్కొన్నది. గ్రూప్‌లవారీగా చూస్తే.. టాటా గ్రూప్ విలువ 37 శాతం వృద్ధితో రూ.32.27 లక్షల కోట్లుగా ఉన్నది. రిలయన్స్ గ్రూప్ రూ.19.71 లక్షల కోట్లుగా ఉంటే.. గౌతమ్ అదానీ గ్రూప్ విలువ



రూ.13.40 లక్షల కోట్లుగా తేలింది. ఇక ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న 500 కంపెనీల్లో ప్రతీదాని విలువ బిలియన్ డాలర్లపైనే. ఈ మొత్తం కంపెనీల వాల్యూ కూడా 3.8 ట్రిలియన్ డాలర్లను తాకింది. రెవిన్యూ ట్రిలియన్ డాలర్లుగా ఉంటే.. లాభం రూ.8 లక్షల కోట్లుగా ఉన్నది. పన్నులు రూ.2.2 లక్షల కోట్లుగా ఉండగా.. ఉద్యోగులు 85 లక్షల మంది ఉన్నారు.



## క్యూ3 జీడీపీ 6.4%!: ఇక్రా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగా నమోదు కావచ్చని భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.7 శాతంగా ఉంటే.. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఏకంగా ఏడు త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 5.4 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. ఇందుకు మార్కెట్‌లో డిమాండ్ బలహీనపడటం, కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం తగ్గిపోవడం కారణంగా పేర్కొన్న ఇక్రా.. ప్రస్తుతం ఈ రెండు అంశాల్లో పరిస్థితులు మెరుగయ్యాయని అంటున్నది. అందుకే వృద్ధిరేటు అంచనా 6.4 శాతంగా నమోదు కావచ్చని చెప్పింది. కాగా, ఈ నెల 28న అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్‌వో అధికారికంగా ప్రకటించనున్నది. కాగా, ఆర్బీఐ వృద్ధి అంచనా ఈసారికి 6.6 శాతంగా ఉన్నది.



మంగళవారం న్యూఢిల్లీలో ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు తదితరులు

# ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) సంస్థ మంగళవారం ఓ సరికొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు చేతులమీదుగా దీన్ని ఆవిష్కరించింది. ఇక ఇదో నాన్-లింక్డ్, వ్యక్తిగత/బృంద, పొదుపు, తక్షణ యాన్యుటీ ప్లాన్. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ రకాల కోసం విస్తృత శ్రేణిలో యాన్యుటీ ఆప్షన్లను అందిస్తుంది. జీవించి ఉన్న పాలసీదారులకైనా, మరణించిన పాలసీదారుల నామినీలు, వారసులకైనా ప్లాన్ నిబంధనలకు లోబడి ఎంచుకున్నవిధంగా ఒకేసారి లేదా వాయిదా పద్ధతుల్లో చెల్లింపులుంటాయి. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్ గోయల్‌లతోపాటు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతీ ఇతర మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

**స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రత్యేకతలు**

- సింగిల్ ప్రీమియం, తక్షణ యాన్యుటీ.
- కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా విస్తృత రీతిలో యాన్యుటీ ఆప్షన్లు.
- పాలసీదారుడి కనీస వయసు 18 ఏండ్లు. గరిష్ఠ వయసు యాన్యుటీ ఆప్షన్‌నుబట్టి 65 నుంచి 100 ఏండ్లు.
- సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ ఆప్షన్లను ఎంచుకునే వెసులుబాటు.
- ప్రస్తుత పాలసీదారులకు, చనిపోయిన పాలసీదారుల నామినీ లేదా వారసులకు యాన్యుటీ రేటు పెంపు ద్వారా ఆకర్షణీయ ప్రోత్సాహకాలు.
- పాలసీ నిబంధనలకు లోబడి పాక్షికంగానైనా లేదా పూర్తిస్థాయిలో నగదు ఉపసంహరించుకొనే సౌకర్యం.
- కనీస కొనుగోలు ధర లక్ష రూపాయలు. దీన్ని మించి ఎక్కువగా కొంటే ప్రోత్సాహకాలూ లభిస్తాయి.
- వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ చెల్లింపులకు అవకాశం. వీటికి తగ్గట్టే యాన్యుటీ వాయిదాలుంటాయి.
- ప్రత్యేకంగా ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్లకు తక్షణ యాన్యుటీకి వెసులుబాటు.
- దివ్యాంగుల కోసం కూడా ప్రయోజనకర ఆప్షన్లు.
- www.licindia.in ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాన్‌ను కొనవచ్చు. ఎల్ఐసీ ఏజెంట్, ఇతర ఆఫ్‌లైన్ మార్గాల ద్వారా కూడా కొనవచ్చు.
- ప్లాన్ కొన్న 3 నెలల తర్వాత ఎప్పుడైనా పాలసీదారులు రుణ సదుపాయం తీసుకునే వీలుంటుంది.

### స్టార్టప్‌లకు బ్రెజిల్ దన్ను

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. దేశీయ స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో టీహబ్..బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు ఇక్కడ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా కృత్రిమ మేధస్సు, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ తదితర రంగాల్లో పరస్పర సహకారం ఉంటుందని వారు వివరించారు.



### టెస్లా ఇండియాలో నియామకాలు షురూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టాలని ఇప్పటికే ప్రయత్నాలు వేగవంతం చేసిన అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా..తాజాగా ఉద్యోగ నియామకాలను ప్రారంభించింది. అతి త్వరలో తన తొలి షోరూంను ప్రారంభించబోతున్న సంస్థ అందుకుతగ్గట్టుగా రిక్రూట్‌మెంట్లను ఆరంభించింది. తన తొలి షోరూంను ముంబైలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. నూతన ఉద్యోగాల్లో సర్వీస్ అడ్వయిజర్లు, సర్వీస్ మేనేజర్లు, స్టోర్ మేనేజర్లు ఉన్నారు.

### కజారియా నయా సెంటర్



హైదరాబాద్, ఫిబ్రవరి 18: దేశంలో అతిపెద్ద సిరామిక్ అండ్ విట్రిఫైడ్ టైల్ తయారీ సంస్థ కజారియా..హైదరాబాద్‌లో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ అన్ని రకాల టైల్స్ లభించనున్నాయని కంపెనీ ఎండీ రిషీ కజారియా తెలిపారు. టైల్స్, బాత్, శానిటరీవేర్ ఉత్పత్తులను ప్రతీ కుటుంబానికి అందించడం లక్ష్యంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.

## బంగాళాఖాతంలో ఆవర్తనం

- **ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు భారీ వర్షసూచన**
- **24 తర్వాత ఉత్తరాదిలో పెరగనున్న ఉష్ణోగ్రతలు**
- **దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే పెరిగిన ఎండలు : ఐఎండీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : వేసవి సమీపిస్తున్న తరుణంలో దేశంలోని కొన్ని రాష్ట్రాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన చేసింది. బంగాళాఖాతంలో ఉపరితలంలో ఆవర్తనం ఏర్పడి ఈశాన్య దిశగా కొనసాగుతున్నదని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. బంగాళాఖాతం మీదుగా తుఫాన్ గాలులు వీయనున్నాయని, దీంతో రానున్న వారం రోజులు ఉత్తరాదిలోని కొన్ని ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. పర్వత ప్రాంతాల్లో హిమపాతం భారీగా కురవనున్నదని, బంగాళాఖాతంలో తుఫాన్ గాలుల కారణంగా అసోం, నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, పశ్చిమబెంగాల్, సిక్కింతోపాటు ఉత్తరాంచల్, జార్కండ్‌లో భారీ వర్షాలు పడనున్నట్టు హెచ్చరించింది. ఫిబ్రవరి 21 వరకు ఈశాన్య ప్రాంతంలో 1.5 కిలోమీటర్ల ఎత్తులో గాలులు వీచే అవకాశముందని, దీంతో అక్కడ భారీ వర్షాలు పడవచ్చని అంచనా వేసింది. ఫిబ్రవరి 19న అసోం, మేఘాలయలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. హిమాచల్‌ప్రదేశ్‌లో తేలికపాటి వర్షం, భారీగా మంచు పడవచ్చని చెప్పింది. 24 తర్వాత ఉత్తరాదిలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే పెరిగాయని వివరించింది.

**పెరుగుతున్న ఎండల తీవ్రత..**

తెలంగాణలో వారం రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. రాబోయే 3 రోజుల్లో సాధారణ పగటి ఉష్ణోగ్రతలు 1-2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని, రాష్ట్రవ్యాప్తంగా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.4 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.8 డిగ్రీలుగా నమోదైనట్టు ప్రకటించింది. మంగళవారం నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 36.3 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 36, ఆదిలాబాద్‌లో 35.8, హైదరాబాద్‌లో 35.7, మెదక్, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో 35.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు..అదుపులో నిందితులు

## ముగ్గురు రోహింగ్యాలు అరెస్టు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి18 : అక్రమంగా దేశంలో నివసిస్తున్న ముగ్గురు రోహింగ్యాలను అరెస్టు చేసినట్టు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జడ్చర్ల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం నర్సింగ్‌తండా శివారులోని ఓ ఫాంహౌస్‌లో రోహింగ్యాలు ఉన్నట్టు సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బర్మాకు చెందిన నూర్‌అహ్మద్, అరబ్‌అహ్మద్, సుమాయ హైదరాబాద్ వాసులుగా చెబుతూ ఫాంహౌస్‌లో వ్యవసాయ పనులు చేస్తున్నారు. నూర్‌అహ్మద్ తప్పుడు పాస్‌పోర్టు తయారు చేసుకున్నట్టు గుర్తించారు. బర్మా దేశానికి చెందిన అతడి భార్య రిజ్వానా హైదరాబాద్ వాస్తవ్యురాలిగా జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డును పొందినట్టు పేర్కొన్నారు. రిజ్వానా పరారీలో ఉన్నట్లు చెప్పారు.

# సిటీలో జాగా ఉంటే ఇందిరమ్మ ఇల్లు

- **స్పష్టం చేసిన హౌసింగ్ అధికారులు**
- **స్థలం లేనివారికి ఇప్పట్లో లేనట్టే!**



హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సహా వివిధ నగరాల్లో ఇంటి జాగా ఉన్నవారు ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని గృహనిర్మాణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆర్థిక స్థితిగతులు, ప్రభుత్వం పేర్కొన్న నియమ నిబంధనలకు లోబడి అర్హుల ఎంపిక జరుగుతుందని వారు పేర్కొన్నారు. జాగా ఉండి ఇల్లు లేనివారు, కచ్చా ఇళ్లలో నివసిస్తున్నవారికి మొదటి దశలో ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. పట్టణ ప్రాంతాల్లో చాలామంది పేద, మధ్యతరగతి ప్రజలు శివారు ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసుకొని ఇల్లు నిర్మించుకునే స్థోమత లేకపోవడంతో అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు. పట్టణ పేదల కోసం ప్రభుత్వం ఇంతవరకు సరైన మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో ఇప్పటివరకు సిటీలో ప్లాట్లు ఉన్నవారు ఇంటికి దరఖాస్తు చేసుకోవాలా, చేసుకోవద్దా? అనే సంశయంలో ఉన్నారు. ఈ విషయమై కొంత స్పష్టత వచ్చింది. జాగా లేనివారు, మురికివాడల్లోని ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు ఖాళీ జాగాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి మొదటి దశలో ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిన తర్వాతే వీరికి ఇల్లు మంజూరుపై స్పష్టత వస్తుంది.

**ప్లాట్లు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు**

'నగరాలు, పట్టణాలే కాదు, ఎక్కడ ఇంటి జాగా ఉన్నా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగా అర్హుల ఎంపిక జరుగుతుంది. ప్లాటు ఎంత విస్తీర్ణంలో ఉన్నప్పటికీ నిర్ణీత వైశాల్యానికి తగ్గకుండా ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఇల్లు మంజూరైతే ప్రభుత్వం దశలవారీగా రూ.5 లక్షలు అందిస్తుంది. జాగా లేనివారికి మొదటి విడతలో ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది' అని గృహనిర్మాణ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.

### మెట్లుఎక్కుతూ.. గుండెపోటుతో భక్తుడి మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తేతెలంగాణ): మొక్కు చెల్లించటానికి తిరుమలకు వెళ్లిన ఓ భక్తుడు మెట్లు ఎక్కుతుండగా గుండెపోటుతో మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. షాద్‌నగర్‌కు చెందిన వెంకటేశ్ (50) తిరుపతికి వెళ్లాడు. మంగళవారం శ్రీవారి మెట్లమార్గం నుంచి తిరుమల కొండ ఎక్కుతుండగా.. వెంకటేశ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తోటి భక్తులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చంద్రగిరి ఏరియా దవాఖానకు తరలించగా.. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్టు ధ్రువీకరించారు.

### రాజగోపాల్‌రెడ్డి పీఏ హైడ్రామా

- **రూ.40 కోట్లు వసూలు.. పరారీ అంటూ సోషల్‌మీడియాలో ప్రచారం**
- **అవన్నీ అవాస్తవాలన్న పీఏ**
- **తాను ఎక్కడికీ పారిపోలేదని స్పష్టీకరణ**
- **పోలీసులకు ఫిర్యాదు**

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పీఏ సతీశ్‌రెడ్డి వ్యవహారంపై మంగళవారం హైడ్రామా నడిచింది. ఆయన అక్రమంగా రూ.40 కోట్లు వసూలు చేసి పరారయ్యారంటూ ఉదయం నుంచి సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. దీంతో బయటికొచ్చిన పీఏ సతీశ్‌రెడ్డి ఈ ప్రచారాన్ని ఖండించారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నుంచి ప్రకటనను విడుదల చేశారు. తాను ఎక్కడికీ వెళ్లలేదని, హైదరాబాద్‌లోనే ఉన్నానని ప్రకటించారు. రాజగోపాల్‌రెడ్డి వద్ద 16 ఏండ్లుగా పనిచేస్తున్నానని, ఆయనకు గానీ, తన కుటుంబానికి గానీ మచ్చతెచ్చే పని చేయబోనని స్పష్టంచేశారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు.

### బెయిలు పిటిషన్లను సత్వరం పరిష్కరించండి

- **ఫోన్ ట్యాపింగ్ కేసులో కింది కోర్టుకు హైకోర్టు సూచన**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ పెట్టిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఇద్దరు నిందితుల బెయిలు పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని కింది కోర్టుకు హైకోర్టు సూచించింది. ఫోన్ ట్యాపింగ్‌పై చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో తమను అక్రమంగా అరెస్ట్ చేశారని, బెయిలు మంజూరు చేయాలంటూ టీ సంతోష్‌కుమార్, బీ పరశురాములు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, రాధాకిషన్‌రావుకు హైకోర్టు ముందస్తు బెయిల్ ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని నిందితుల తరఫు న్యాయవాది తెలిపారు. పోలీసులు సంతోష్, పరశురాములును విచారణకు అని పిలిచి అరెస్ట్ చేశారని, బెయిలుపై విడుదల చేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి నిందితుల బెయిలు పిటిషన్లు కింది కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణ చేపట్టి నిర్ణయం వెలువరించాలని సూచించారు.

### కేసు వాదిస్తూ న్యాయవాది హఠాన్మరణం

- **హైకోర్టులో విషాద ఘటన**



హైదరాబాద్, ఫిబ్రవరి 18, నమస్తే తెలంగాణ: తెలంగాణ హైకోర్టులో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకున్నది. న్యాయవాది పసునూరు వేణుగోపాలరావు తన కేసులో వాదనలు వినిపిస్తూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో హాలులో ఉన్నవారంతా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ విషయాన్ని గమనించిన ఇతర న్యాయవాదులు ఆయన్ని వెంటనే పైకిలేపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయనను హుటాహుటిన అంబులెన్స్‌లో ఉస్మానియా దవాఖానకు తరలించారు. అప్పటికే వేణుగోపాలరావు గుండెపోటుతో చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని హిల్‌కాలనీలో వేణుగోపాలరావు నివాసం ఉంటున్నారు. అప్పటి వరకు తమతో ఉన్న న్యాయవాది మరణించడంతో న్యాయవాదులు, బెంచ్‌పై ఉన్న న్యాయమూర్తి నిర్ఘాంతపోయారు. ఈ ఘటన అనంతరం కేసుల విచారణను ముగించి న్యాయమూర్తి బెంచ్‌దిగి వెళ్లిపోయారు. న్యాయవాది ఆకస్మిక మరణ వార్త తెలియగానే ఇతర కోర్టులు కూడా అత్యవసర పిటిషన్లు, పాస్ ఓవర్ పిటిషన్లను విచారించి రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశాయి. న్యాయవాది వేణుగోపాలరావు ఒక కేసు విచారణ సమయంలో 21వ కోర్టు హాలులో న్యాయమూర్తి ముందు వాదనలు వినిపిస్తున్నారు.

### శివాజీ జయంతి వేడుకలకు అనుమతివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 18, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. శాంతియుతంగా వేడుకలు నిర్వహించాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు పలు షరతులు కూడా విధించింది. శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే నిర్వాహకులపై చర్యలు తీసుకునే స్వేచ్ఛ పోలీసులకు ఉంటుందని స్పష్టంచేసింది. జయంతి వేడుకకు అనుమతి కోరుతూ ఈ నెల 17న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదంటూ గోల్కొండలోని వీర్ శివాజీ సేన, బీజేవైఎం అధ్యక్షుడు నితిన్ నంద్కర్ హైకోర్టులో అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలుచేశారు. ఈనెల 19న సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో 150 మందితో వేడుకలు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. జాంబాగ్ ట్రూప్‌బజార్‌లోని హనుమాన్ మందిర్ ఎదురుగా ఉన్న సుందర్‌భవన్ నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు.



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు విచారణ కోసం వీర రాఘవరెడ్డిని తీసుకువచ్చిన పోలీసులు

### పోలీసుల కస్టడీలో వీరరాఘవరెడ్డి

- **చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో విచారణ**

మొయినాబాద్, ఫిబ్రవరి 18: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన రామరాజ్యం వ్యవస్థాపకుడు వీర రాఘవరెడ్డిని మొయినాబాద్ పోలీసులు కోర్టు అనుమతితో మంగళవారం కస్టడీకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి విచారించగా సొంతంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకుని రామరాజ్యం స్థాపించాలనే ఆలోచనతో ఈ కార్యానికి పూనుకున్నానని వీరరాఘవరెడ్డి వెల్లడించినట్టు సమాచారం . కోసలేంద్ర ట్రస్టు ద్వారా నిధుల సేకరణ చేసి సైన్యంలో చేరిన వారికి వేతనాలు చెల్లించడానికి ప్రణాళిక రూపొందించినట్టు నిందితుడు పేర్కొన్నట్టు తెలిసింది. మరో రెండు రోజుల పాటు విచారణ చేపట్టనున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

### హైదరాబాద్‌లో జాతీయ జీవవైవిధ్య యువజన సదస్సు

- **రేపట్నుంచి మూడ్రోజులపాటు**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : జీవవైవిధ్య పరిరక్షణలో యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ జీవవైవిధ్య బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో జాతీయ జీవవైవిధ్య యువజన సదస్సునిర్వహించనున్నట్లు తెలంగాణ జీవవైవిధ్య బోర్డు కార్యదర్శి కాళీచరణ్ ఎస్ ఖార్తడే తెలిపారు. ఈ సదస్సును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈ సదస్సులో పర్యావరణ సవాళ్లు, పరిష్కారాలపై చర్చించనున్నట్టు తెలిపారు.